
# కాపురం

'ఏంరా, మధూ. నీవు దసరాకు మీ అత్తారూరుకు వెళ్లి కోడలును తీసుకు రారా. ఎన్నాళ్ళని వుంచుకుంటావురా. ఇన్నాళ్లా అవసరం తీరలేదని వూరుకున్నాను. ఆ కాస్తాగూడా అయి నాలుగు నెల్లాయె. అయినా యీడొచ్చిన పిల్లను వాండ్లు మాత్రం ఎన్నాళ్లుంచుకొంటారు. ఇదుగో ఫలానా రోజుకు వచ్చి తీసుకుపోవలసిందని నన్ను వ్రాయటాయె మీ అత్తియ్యగారు. పిలుపు లేకపోయినాయిక నీ అవుసరమే కాబట్టినీవన్నా పోయిరారా' అంది మా అమ్మ నేను అప్పుడే భోంచేసి వాకిట్లో మంచంమీద చతికిలబడుతుంటే. వద్దు వద్దంటుంటే ఏమో మించిపోతున్నట్లు నాకు పద్దెనిమిదో ఏటే మా అమ్మ పెండ్లి కాస్తా చేసేసింది. నా చిన్నతనంలోనే మా నాయన చనిపోవటం చేత, నాకింకో అన్న గానీ, తమ్ముడు గానీ, చెల్లెలు గానీ లేకపోవటంచేతా, మా అక్కయ్య కాపురానికి వెళ్ళినప్పటి నుంచీ యింట్లో యింకో మనిషి - అందులోనూ ఆడపిల్ల తిరుగుతూవుంటే బాగుంటుందని అనిపించేది ఆమెకు. నాకు తల్లి మీద వుండే మమకారంవల్లా ఆమె చెప్పినట్లే చేద్దామనే ఉద్దేశంలో *M. A.* క్లాసులో చేరుతూ పెండ్లి గూడా చేసుకొన్నాను. సంబంధం గూడా మంచిదే. నా భార్య వాండ్ల అమ్మకూ ఒక్క గానీ ఒక్క పిల్ల. వాండ్ల నాన్నగూడా చాలా ఆర్జించి చిన్నతనంలోనే కాలంచేశాడు. చాలా ఆస్థికి వారసురాలు కాకపోవటమే గాక పిల్లగూడా చాలా తెలివితేటలు గలదని తేల్చేసింది మా అమ్మ. పన్నెండోయేటనే ఒకటి రెండు రోజులలో ఆ పిల్ల తెలివితేటలు ఎలా గ్రహించిందో. గవర్నమెంటులో ఆఫీసర్లకు వారి క్రిందివారి తెలివితేటలు కనుక్కోటానికని ఆరు నెలలు టైమిస్తారు. కాని మా అమ్మ వాండ్లందరకన్న తెలివిగలదేమో మరి. ఆమెకు నచ్చిన సంబంధం. పైగా నాకు నచ్చకపోవటానికి ఏమీ కారణం లేదు. అమ్మ మాట త్రోసి వేయటం దేనికిలే అని సరే అన్నాను. పెండ్లయిపోయింది. పెండ్లికి మా బంధువులం చాలామందిమి వెళ్ళాము. అటువైపున మగదిక్కు లేదుగదా అని మర్యాదలలో కొంచెం అటూ యిటూ అయినా పట్టించుకోకుండానే అన్నీ సర్దుకొన్నారు మా వాండ్లు. పయిగా ఆస్థి అంతా మనకే దక్కుతుందిగదా అన్న అభిప్రాయం వుంది గనుక కట్నకానుకల దగ్గర గూడా ఏమీ పేచీలు రాలేదు. మా అత్తగారు

> 'ఇల్లరికపు టల్లుడికి సుఖంలేదు' కాని అత్తారింట కోడలు అత్తతో మాట్లాడదు. ఇలాటి చిక్కులో కాపురం నిలబడాలంటే అమృతహస్తం అవసరమయింది.

గూడా పెండ్లి నాలుగు రోజులూ అందరితో కలిసి మెలిసి తిరుగుతూ 'మా కాముడిదే అదృష్టం చక్కనివాడు, చదువుకున్నవాడు, తెలివిగలవాడు అయినవాడినే కుదుర్చుకుంది' అంటూ నలుగురితోనూ చెప్పింది. నన్ను గూడా నాలుగయిదు సార్లు కలుసుకొని మాట్లాడింది. 'బాగా చదువుకో నాయనా. మాకు యింక నీవే కొడుకివయినా, అల్లుడివయినా. నీవూ కాముడూ నాకు రెండు కండ్లవంటివారు' అంటూ చెప్పింది. నాకూ ఆ మాటలు వింటుంటే సంతోషం వేసింది. పెండ్లికి వచ్చిన బంధువు లెక్కడి వాండ్లక్కడికి వెళ్లిన తర్వాత నేనూ మా అమ్మా గూడా మా వూరికి వచ్చేశాము. ఎందుకోగాని మా అమ్మమాత్రం అదోరకంగా వుంది. నాకూ ఆమె మనసులో ఏమున్నదీ తెలుసుకోవలెనని అనుపించలేదు. కాలేజీకి శెలవులు లేవు కనుక వెంటనే మా అమ్మకు చెప్పి విశాఖపట్నం చేరాను. మర్నాడే మా అమ్మదగ్గరనుంచీ, మా అత్తియ్యదగ్గరనుంచీ, వుత్తరాలు. మా అమ్మ వుత్తరంలోని ముఖ్యాంశాలు.

చిరంజీవి మధుకు. నీతో చెప్పకుండా వుండకూడదని నిశ్చయించుకొని యీ జాబు వ్రాస్తున్నాను. నీ వింకా రెండేండ్లపాటు చదివితేగాని యం. ఏ. ప్యాసు కావుగదా. యీ రెండేండ్లకూ కనీసం రెండువేలన్నా అవుతవి. పెండ్లిలో మీ అత్తగారు దమ్మిడీ కట్నం గూడా చదివించలేదు. నలుగురిలో

# "తల్లి"

ఎందుకని పూరుకొని తర్వాత ఒక రోజున నేనే మీ అత్తగారితో 'వదినే. ఇక మనం అంతా ఒకటేగదా. నేనూ ఆడదాన్ని. పిల్లవాని చదువు యింక మీరు చూసుకోండి. మా స్థితి మీకు తెలుసును. అద్దెల మీద వచ్చే నూరు రూపాయలతో యిన్నాళ్లూ అబ్బాయిని నేనే చదివిస్తూ వచ్చాను. వాడూ తెలిగానే పరీక్షలిస్తూ వచ్చాడు. యం. ఏ. దాకా నయినా చదివిస్తే వాడే వృద్ధిలోకి వస్తాడని అనుకున్నాను. అందుకే కాస్త కూస్తోవున్న చోట సంబంధం చేశాను. మీరేమీ అనుకోరనుకుంటాను. పైగా మీ కిది ఒక లెక్కలోది కాదని నాకు తెలుసు' అని అన్నాను. మీ అత్తయ్య వెంటనే సరే అని అనేస్తుందనుకున్నాను. కాని ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయింది. మరలా మనం మన వూరికి వచ్చేనాడు 'వదినే, నే నడిగినదానికి సమాధానం చెప్పలేదు?' అన్నాను.

"అవునమ్మా. నేనూ ఆలోచించాను. నాకూ పొలం పుట్రా అదీ వున్నాయి. చూసేవాం డ్లెవరూ లేరు. ఏదో చదువు కున్నన్నాళ్లూ చదువుకొన్నా చదువయి నాక అల్లుణ్ణే ఇంట్లో వుంచుకుంటే అన్ని పనులూ చూసుకపోతాడు. వేరే ఉద్యోగం అదీ చేసి బాధపడక్కర్లేదు గదా అని ఆలోచించాను. అంతే గాని మీ వాడికి చదువు కోసరం అని నేనేమీ యివ్వవలసివస్తుందనుకోలేదు. మీ రు చదువు చెప్పించలేనిచో చదువు మాన్పించి మా ఇంటికి పంపండి పొలం పనులూ అవీ విచారిస్తుంటాడు——మించిపోయిందేమీ లేదు. అయినా యీ రోజుల్లో మనలో ఎంత చదువుకున్నా ఉద్యోగం యిచ్చేవాండ్లెవ్వరూ లేరారు. ఎందుకీ యం. ఏ.లూ, బి. ఏ. లూను," అంటూ మీ అత్తగారు సమాధానం యిచ్చేసింది. ఇది నా కెంతమాత్రం నచ్చలేదు. ఎన్ని అవస్థలు పడయినా నీకు చదువు చెప్పించ నిశ్చయించుకున్నాను. నీ అభిప్రాయం ఏమిటో తెలియజేస్తూ వుత్తరం వ్రాయవలసింది' రెండో వుత్తరం చదువవలెనన్న కుతూహలం కలగలేదు. అయినా ఏముందో చూదామని చదివాను. దానిలో విశేషాలు.

"చిరంజీవి మధుసూదనరావుకు. నీవు చదువుకై తిరిగి విశాఖపట్నం చేరావని తెలిసినది. విజ్ఞానంకోసరం ఎంత చదువు అవుసరమో అంత చదువుకుంటే చాలు. ఉద్యోగం కోసరం చదువనక్కర్లేదు. ఈ రోజుల్లో మనవాండ్లెంత చదువు చదివినా ఎంత తెలివితేటలుగా ప్యాసయినా ఉద్యోగం దొరకటం లేదు. గౌరవంగా జీవనం చేయటానికి వీలులేదు-చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ బస్తీలలో అవస్థ పడవలసిన అవస్థ నీకు లేదు. చదువుకున్నన్నాళ్ళూ చదువుకొని ఇల్లు చేరవలసింది పోయిగా నా ఆస్తినే నీ ఆస్తిగా ఎంచి దీనిని సక్రమంగా మేనేజి చేసుకొన్నచో అందరకూ సౌఖ్యంగా వుంటుంది. మా చిన్నని వదలి నేనూ వుండనక్కర్లేదు. బస్తీలలో నీవూ అవస్థపడ వక్కర్లేదు. మగదిక్కు లేక నేనూ యిబ్బందిపడనక్కర్లేదు. ఇంటి మనిషిగా నీవు పొలం అదీ చూస్తున్నచో మనకు వచ్చే అయివేజులో గూడా లోటుండదు. అన్ని విధాలా అందరమూ సుఖంగా వుండవచ్చును. వృధాగా పరీక్షలకోసరమని ఆరోగ్యం పాడుచేసుకోవద్దు. అదీ గాక మీ అమ్మగారుగూడా నీ చదువు కోసరం ఇబ్బంది పడుతుందేమో. ఆమెకనవసరంగా ఇబ్బంది కలిగించవద్దు ఆమెకిబ్బంది అని తలచిన మరుక్షణం నీ చదువుకు స్వస్తిచెప్పి, ఇక్కడకు రావలసింది. నీ చదువుకోసరం నేను సహాయపడ నిచ్ఛగించలేదు. ఎందుకన ఆ చదువు అనవసరం అని నా అభిప్రాయం. దీనికి మరోలా అనకోవద్దు. నీ ప్రియమయిన కామందు క్షేమం."

రెండో వుత్తరం చదివిన తర్వాత మనసంతా శూన్యం అయింది ఆ వుత్తరాలను అవతలపారేసి శూన్యాకాశంలోకి చూస్తూ పడుకున్నాను. ఎంతసేపటికీ నిద్రపట్టదు' ఏమిటీ యీ చిత్రం. నామీద అంత ప్రేమే వుంటే మా అత్తగారు నా చదువుకెందుకు పాయపడగూడదూ. చదివి వుద్యోగం చేసి మా అమ్మను సుఖపెట్టుదామని అనుకొన్న కలలన్నీ ఏమిగాను. ఒకవేళ నేనే మా అత్తగారింట్లో వుండిపోతే నాకు సుఖముండునా. ఒకవేళ నేను సుఖపడినా మా అమ్మ గతేమి? ఆమెను వదిలి నేను అత్తగారిల్లు చేరటం ఎట్లా? ఆమెకు కోడలు కావాలని నేను పెండ్లిచేసుకున్నాను గాని మా అత్తయ్యకు అల్లుడులేడని గాదుగదా. మా అత్తయ్య ప్లానువల్ల ఆమెకు సుఖం, మా అమ్మకు కష్టం అని గ్రహించుటకు నా కెంతోసేపు పట్టలేదు. కాని మా అత్తయ్య వ్రాసినదంతా నిజము. ఎంత డబ్బో తగలేసి రాత్రింబవళ్లూ కష్టపడి డిగ్రీలు పుచ్చుకుని ఉద్యోగంకోసం నానా యాతనపడి ఎన్నో అవస్థలతో ఉద్యోగం చేయటం దేనికి డబ్బుకోసరమేగదా. ఆడబ్బు యీ డొంక తిరుగుడుమార్గాలవేవీ లేకుండా సుళువుగా లభ్యపడుతుంటే మార్గం మా అత్తయ్య చూపిందికదా. ఆమార్గం ఎందుకు అనుసరించగూడదు. దీనివల్ల లాభమే గాని నష్టము కనుబడుటలేదే. అత్తగారింట్లో వుండిపోవటం అధమం అని పెద్దలంటారు. మా అత్తగారందరి మాదిరిగా కనుబడుటలేదే. నా సుఖంకోసం మంచి సలహానే యిచ్చింది. వయిగా నన్ను కాదని ఆమెమాత్రం ఏంచేస్తుంది. ఒక్కగానొక్క కూతురు. నేను సుఖపడితే నా కూతురుకూ సుఖం. మా యిద్దరి సుఖమే ఆమెకూ సుఖం. అటువంటపుడు నాకేమీ కష్టం వుండగూడదు. ఇంకో విషయం. నావల్ల మా అమ్మ సుఖపడవలె ననుకుంటుంది. అట్లాగే నా భార్యవల్ల నాంకు అమ్మ సుఖపడవలెననుకొనుటలో తప్పేమి? మా అమ్మ సుఖం నాకెంతో-వాండ్లమ్మ సుఖం నా భార్యకూ ముఖ్యం. అయినా నేను లేకపోయినా మా 'అమ్మకు కష్టమేమున్నది. తెలుసు నాకు

32 సంవత్సరముల అనుభవముగల
రెడ్డి అండ్ కో., వారి
(రిజిష్టర్డు)
కుష్టు, బొల్లి, సుఖ రోగాది
చికిత్సలకు నేడే సంప్రతించండి.
నకలు మందులు చూసి మోసపోకుడు
అన్నిభాషలలో కేట్లాగు ఉచితము.
హెడ్ ఆఫీసు: రెడ్డి అండ్ కో.,
గోపాలపురం.
(తూర్పుగోదావరి)
బ్రాంచిలు:- నెల్లూరు, బెజవాడ, రాజమండ్రి
సికింద్రాబాద్, విశాఖపట్నం, బరహంపురం,
మొదలగు పట్టణములలో.

రూపాయలు వస్తవి. నాకు దమ్మిడీ యీయ నక్కర్లేదు. అది పెట్టుకొని ఆమె ఇష్టం వచ్చినట్లు వుండవచ్చును. పుణ్యక్షేత్రములు సేవించవచ్చును. నాదగ్గరకు రానచ్చును. లేక కూతురు దగ్గరకు పోవచ్చును. నాచదువుకోసం యిహ ఆమె కష్టపడ నక్కర్లేదు. ఒకవేళ నేనూ నా భార్యా వుద్యోగం చేస్తుంటే కోడలు ఆమెను సరిగా చూడక పోవచ్చును. అప్పుడయినా మా అమ్మకు కష్టమేగదా. పెంచి పెద్దవాడిని చేస్తే నాకు సుఖం లేకపోవటం అలాగుండినా ఇంట్లోనే నాకు స్వతంత్రం లేదని ఆమె అప్పుడనుకోవలసిందే గదా. నేనే మా అత్తగారింట్లో వుండిపోతే ఆమెకా బెంగ అక్కర్లేదు. ఆమె స్వతంత్రానికి భంగం వుండదు. కోడలుగూడా అపుడు ఆమెను ప్రేమతో చూచుటకు వీలుంటుంది. ఇలా ఆలోచిస్తూంటే నిద్రరాలేదు. వెంటనే లేచి లైటు వేశాను. గడియారం అప్పుడే 12 కొట్టింది. కలం కాగితం తీసి సమాధానాలు వ్రాశాను.

'పూజ్యురాలయిన అమ్మగారికి, నమస్కారములు. నీవుత్తరం చేరింది. మాఅత్తయ్య గూడా ఒక వుత్తరం వ్రాశింది. నా చదువును గురించి నీవు కష్టపడటం నా కిష్టం లేదు. చదువుకోసరం అని అత్తయ్యను బ్రతిమి లాడటంగూడా వద్దు. నేను ఇక చదువుకు స్వస్తి చెప్పినట్లే. నాలుగయిదు రోజుల్లో అక్కడికి వచ్చి అన్ని సంగతులూ మాట్లాడుతాను. ఇప్పటికింతే' అని ఒక వుత్తరం పూర్తి చేశాను.

'పూజ్యురాలయిన అత్తయ్యగారికి నమస్కారములు. మీ వుత్తరం చూచాను. మా అమ్మగారు మీతో ముచ్చటించిన విషయములూ మీరిచ్చిన సమాధానమూ గూడా తెలుసుకొన్నాను. పరిస్థితులన్నీ పరిశీలించి ఒక నిర్ణయానికి వచ్చాను. త్వరలోనే మీ దగ్గరకువచ్చి మాట్లాడుతాను. సౌభాగ్యవతికి నా శీస్సులు—' అని రెండో వుత్తరం ముగించాను.

మర్నాడే కాలేజీలోని స్నేహితులందరి దగ్గర శెలవు తీసుకొని మూటా ముల్లే కట్టి మా వూరికి బయలుదేరాను. 'వివాహోవిద్యానాశాయ' అన్న ముక్క సార్థకం చేశావురా అని మాత్రం అన్నారు నా స్నేహితులు. వారితో నా కింకా ఏమి పని. చదువుకుంటున్నంతకాలమే వారూ నేనూను. తర్వాత ఎవరి దోవ వారిదే. ఆ స్నేహితం వృద్ధి పొంది ఉపయోగపడేది నూటికీ కోటికీ ఒక్కచోటే. అయినా నాకు నా చదువుకొన్న రోజుల నాటి స్నేహితులు బహు తక్కువ. అందువల్ల వారి సలహాలంటూ ఏవీ లేవు. పైగా వారితో నా గృహవిషయములు ప్రస్తావించనూ లేదు. ఎవని కాపురం వానిదే. ఎవరి కష్టములు వారివే. ఒకరి సలహా అంటే నాకు మంట. మనకు తెలియకపోతేగదా ఒకరిని సలహా అడగటం. అందువల్ల యీ విషయములో నాకన్నీ అద్దంలో చూచినట్లు తెలిసిన విషయములే. దీనికి ఒకరి సలహా ఏముందీ. ఎందుకురా కాలేజీ మానటం అంటే 'చదువు చాలించాలోయ్' అని మాత్రం అన్నా. అంతే. మా అమ్మతో అన్ని సంగతులూ చెప్పాను. ఆమెకు మాత్రం నేను చదువు మానటం యిష్టం లేదు. ఏ యిబ్బందీ లేదు. చదువుకోవాయనా అన్నది. కాని నేను నా ఉద్దేశ్యాన్ని మార్చుకొన్నాను. ఆమె గూడా మరి బలవంత పెట్టలేదు. 'అబ్బాయీ. నీవూ పెద్దవాడివయావు నీ ఇష్టం. నీకు చెప్పే రోజులు దాటిపోయినవి.' అని మాత్రం అన్నది. నా కామాటలు కొంచెం కష్టం కలిగించినా నిజము మాట్లాడింది మా అమ్మ.

'అయితే యిప్పటినుంచే నీవు మీ అత్తగారింట్లో ఉండిపోతావా' అని అన్నది. 'లేదమ్మా. ఒకసారి పోయి ఆమెతో మాట్లాడి వస్తాను' అని చెప్పతూ మా అత్తగారూరు బయలుదేరాను. ఉత్తరం వ్రాయకుండానే పిలుపు లేకుండానే వెళ్లాను. పిలుచుట కేమున్నది. నా పనిమీద నేను వెళ్లాను. వాకిట్లో ఎవరో స్నేహితులతో కబుర్లు చెపుతున్నది కాము. నన్ను చూడంగానే ఎక్కడి అమ్మాయిలు అక్కడికి పోయినారు. కాము మాత్రం లోపల దాక్కొన్నది. ఇంట్లో వాండ్లమ్మ లేనట్లున్నది. నేనే లోపలికి పోయి 'కామూ' అని పిలచాను. కాని సమాధానం లేదు. అక్కడే ఒక మంచంవుంటే వాల్చుకు కూర్చున్నాను. ఏమి చెపుమా. మాట్లాడలేదు. మూగనోమే మన్నా పట్టిందేమోనంటే నేను రాక ముందు పిల్లలతో మాట్లాడుతూనే వుందో' అనుకుంటుంటే మా అత్తగారు వచ్చింది. 'ఒహో, మధూ! ఎప్పుడు రావడం. ఒక వుత్తరంముక్క వ్రాస్తే స్టేషనుకు బండీ పంపేదాన్నే' అంది.

ఆ. ఎందుకులే. నా కిది క్రొత్త చోటు కాదు గదా. అయినా మీ అమ్మాయి పలకదేం' అన్నా. 'ఆ. ఇది పల్లెటూరుగదూ. పిల్లలకు సిగ్గెక్కువ. ఇప్పట్నుంచీ మాట్లాడితే ఎగతాళి చేస్తారు. సరే కానిస్నానానికిలే, భోంచేస్తువుగాని' అంటూ లోపలికి వెళ్లిపోయింది.

భోజనాలవీ అయినవి. ఆరాత్రిదాకా మళ్లీ నా భార్య నాకు కనపడితే ఒట్టు. మా అత్తయ్యతో అన్నా. 'ఇలాగయితే ఎలా అత్తయ్యా ఎంతసిగ్గయినా నలుగురువున్నపుడు సిగ్గుపడవచ్చుగాని ఇంట్లో యింకెవ్వరూ లేనపుడుగూడా సిగ్గయితే ఎలా. నేనూ చదువుకొన్నవాడిని. నాకు సిగ్గంటే భయంలేదు. ఇంట్లో మాట్లాడటానికి మరెవ్వరూ లేరయిరి. మీరు మీ అమ్మాయితో చెప్పిచూడండి' అనిమాత్రం అన్నాను. రెండుమూడురోజులు గడిచినవి. వేళకు టిఫిన్లు—భోజనాలూ తప్ప మరేంలేదు. పాలేరు నాతో "బాబయ్యా, పొలాలు చూపెడతా రండి కారుగా పోదాం' అన్నాడు." 'పోయిమాసిరా నాయనా' అంది అత్తయ్య. ఏదో ఆ పొలం— యీ పొలం అదీ యిదీ చూడటం అయిపోయింది. కాని ఇంట్లో నాతో మాట్లాడకపోయినా కనుపించటంగూడా మానేసింది కాము. నేను వాకిట్లో వుంటే

గనోక్యూర్
అన్నిసెగలకు గంటలలోగుణము
ఈశ్వర ఫార్మశీ, రాజమండ్రి.

మెరిల్
చాలామంచి
డ్రై బ్యాటరీ రేడియో!

బుష్
బ్రిటన్స్ బెష్టుకరెంటు &
డ్రైబ్యాటరీ రేడియో!

డీ స్ట్రిబ్యూటర్లు!
నారాయణ్ రేడియో స్టోర్సు
ప్రకాశం రోడ్డు, గవర్నరుపేట, బెజవాడ 2.

ఎవరెడి బ్యాటరీలు నమ్మకమైనవి ఎల్లప్పుడును దొరకును.

తను ఇంట్లో. నేను ఇంట్లోకి పోతే తను దొడ్లోకి. ఇది నాకేమీ బాగుండలేదు.

'మా అత్తయ్యతో మళ్ళీ అన్నాను. 'అత్తయ్యా, చదువుకు స్వస్తి చెప్పాను. ఇక్కడే వుండి అన్నివిధాలా మీకు సహాయపడదామనే నిశ్చయించుకున్నాను. కాని మీ అమ్మాయి ఇంత సిగ్గుగా వుంటే యీ యింట్లో యింకో గడియ వుండేది లేదు' అన్నాను. 'అబ్బాయీ మధూ. అంత తొందరయితే ఎలా నాయనా, కొత్త పెండ్లికూతురు చనువుగా మగనితో మాట్లాడుతుందా. ఆ అక్కరా తీరాక, నే నొద్దన్నా నువ్వొద్దన్నా వూరుకుంటుందా.' అని అన్నది అత్తయ్య. 'సరే, ఆ అవసరం ఏదో తీరినాకనే మళ్ళీ వస్తాను' అని చెప్పి మా అక్కయ్యగారూరు వెళ్లాను.

నాకు మా అక్కయ్యఅంటే చిన్నప్పటినుంచీ అదొక వెర్రిప్రేమ. పయిగా మా అమ్మమాటకన్నా ఆమె మాట అంటే భయమూ, భక్తీను. ఆమె కాపురానికెళ్ళి ఐదారేండ్లయింది. ప్రతి శెలవులకూ నేను మా బావగారూరు వెళ్ళేవాడిని. మా బావ ఆ వూరి స్కూలుకు హెడ్మాష్టరు. నన్ను చూడంగానే మా అక్కయ్య సంబరపడేది. నాకేమేమి యిష్టమో అవన్నీ చేసి పెట్టేది. నా పెండ్లయినాక మా అక్కయ్యగారూరు వెళ్ళటం అదే మొదటిసారి. మామూలుగానే మా అక్కయ్య సంతోషంగా నన్నాహ్వానించింది. ఎక్కడినుంచిరా తమ్ముడూ రావటం అని అడిగింది. 'అత్తగారింటినించే' అన్నాను. 'అవున్నే, పెండ్లికాంగానే అత్తగారూరు ముందూ, మావూరు తర్వాతాను' అని అన్నది. నాకూ కొంచెం యిదనిపించింది. 'అయినా నిజమేలే. అసలు రావటం మాని వెయ్యలేదు.' అని మళ్ళీ అనేసింది. 'అక్కయ్యా, ఆమాట లెందుకే, నేను ఎందుకురావటం మానేస్తాను?'

'ఆ. ఎలాగయినా మీ అత్తగారు లక్షాధికార్లు. నీ భార్య లక్షాధికార్ల కూతురు. భాగ్యవంతుడవయిపోతివి నీవూను. మేము కనపడుతామా అని అనుమానం.'


'ఎందు కక్కయ్యా, నన్నిట్లా దెప్పి పొడుస్తావు.'

'తమ్ముడూ, నీవు చిన్నవాడివి. నీకింకా అనుభవంలేదు ఇన్నాళ్లూ చదివినది చదువు ఇకముందుదే అనుభవం.'

'ఏమిటక్కయ్యా! నీమాటలు నాకు సరిగా అర్థం కావటం లేదు. విపిలే సరిగా చెప్పు. లేకపోతే—'

'ఆఁ ఏం లేదు. నీ పెండ్లిలోనే చూశాను. మీ అత్తగారికి గర్వం. నీ భార్య సంగతి యింకా తెలీదు. నీవు గనక జాగ్రత్తగా ప్రవర్తించకపోతే కష్టపడుతావు. పయిగా నీ జన్మ వృథా చేసుకుంటావు. నీకు చెప్పవలసినది చాలా వుంది. అయినా నీవు తెలివితక్కువ వాడవు గాదు. బి. ఏ. దాకా చదువుకొన్నవాడివి. కనుక కొన్ని సంగతులు చెప్పకుండానే వదిలేస్తున్నాను.'

'అక్కయ్యా, నీ మాటలు నాకేమీ



బోధపడుటలేదే. అసలు సంగతులన్నీ చెప్పవే?'

'ఆ. ఏముందిరా తమ్ముడూ. పెండ్లిలో ఎందుకులే అని నీతో కొన్ని సంగతులు చెప్పలేదు. మీ అత్తయ్యగారికి మన అమ్మంటే లక్ష్యమే లేదు ఇక నా సంగతి ఏదో నీ వొక్కడవే నాకూ, నే నొక్క దానినే నీకూను. అటువంటప్పుడు ఆడబిడ్డ లాంఛనాలయినా జరపమని అమ్మ అడిగితే 'వూరుకోండీ' అని అన్నది మీ అత్తగారు. ఇవతలవాం క్షేమనుకుంటారో అన్న బెంగ ఆమెకు లేనేలేదు. నీవీ పరిస్థితులలో ఆమెతో జాగ్రత్తగా మసలుకోవలె సుమా. నీ ఒక్కడి సుఖమే చూసుకున్నచో అమ్మ విచారపడవలసివుండును. నాకూ ఏదో అండగా వుంటావనుకున్నాను. నీ ధనధాన్యము లేమీ అక్కర్లేకపోయినా అవసరంలో ఆదుకోవలసినవాడవు నీవు. నీ ఒక్కడి సుఖం చూసుకొని మీ అత్తగారింట్లో వుండిపోతే ఇహ మాకు నీ వల్ల ప్రయోజనమే లేదు. అందుకనే నీవు కొంచెం ఆలోచించి మరీ ప్రవర్తించవలసిందిగా చెబుతున్నాను. మనిషయిన వాడు స్వయంపోషకుడుగా వుండవలెగాని ఒకరిమీద ఆధారపడరాదు. అది నీకూ మాకూగూడా గౌరవం. అంతేగాని చదువు మానేసి అత్తగారింట్లో విందులారగిస్తూ వారికి సేవచేస్తూ కాలంగడపదలచినటయితే ఇక నే చెప్పవలసిందీ లేదు. నీవు వినవలసిందీ లేదు. ఇప్పుడు నీపయిన ఎంత ప్రేమ తొణికించినా రాను రాను నీకు నీ బ్రతుకుపయినే రోత పుట్టుకొస్తుంది నీవు వాళ్ళ యింట్లో వుండిపోతే. నీకు యిప్పుడు గాకపోయినా, మరి కొన్నాళ్ళకయినా ఆ యిబ్బందులు తెలుస్తవి. నీకు స్వతంత్రం అనేదే వుండదు. పయిగా నీ భార్యకు గూడా నీమీద గౌరవుంటుందా అంటే అదీ అనుమానమే. నీకీ విషయాలన్నీ తెలియక ప్రస్తుతంలో సుఖమే అనిపించినా తర్వాత ప్రమాదం సుమా. నాకు తోచిన విషయాలు చెప్పేశాను. నీకు కొంచెం కష్టం కలిగినా విలకడమీద సత్యము నీకే తెలియగలదు. అని ముగించింది మా అక్కయ్య. నాకు తల వంగిపోయింది. నా చదువు నిష్ప్రయోజనం అని ఆనాడు తెలిసింది. ఏమీ చదువని మా అక్కయ్యకు ఇంత లోకజ్ఞానం ఎక్కడిదా అని నా కాశ్చర్యం వేసింది. ఆమెతో జరిగిన సంగతులన్నీ చెప్పాను. చదువుకు స్వస్తి చెప్పిన సంగతీ చెప్పాను. 'ఏమీ ఫర్వాలేదు. తమ్ముడూ. బి. ఏ. దాకా చదువుకొన్నావు. ప్రయత్నంచేస్తే ఏదో వుద్యోగం దొరక్కపోదు. నీవు కష్టపడి నీరెక్కల మీద తెచ్చుకొనేది పదిరూపాయలయినా ఆ పదిరూపాయలకు నీ యిష్టంవచ్చినట్లు చేసుకోవచ్చు. కాని మీ అత్తగారి ఆస్తిమీద పేలుకునే లు తెచ్చినా నీ కా స్వతంత్రంవుంటుందేమో బాగా ఆలోచించుకో' అన్నది. మా అక్కయ్యకు నా కృతజ్ఞతను తెల్పి మర్నాడే మా వూరు చేరాను.

మా అమ్మతో జరిగినదంతా చెప్పాను. అక్కయ్య బుద్ధి చెప్పిందన్నాను. కాని మా అమ్మ యిలాగన్నది. 'అబ్బాయీ. నీ కొకరు చెప్పటం నీవు వినటంగాదు. నీకు తోచినట్లు చేసి నీ సుఖం చూసుకో. నీవు సుఖపడితేనే గదా తర్వాత మా సుఖం. నీవు సుఖపడవలెనని నేనీ పెండ్లి చేశాను గాని నీవుకష్టపడవలెననిగాదు. అక్కయ్యకు నీవు ఒరగబెట్టాల్సిందేమీ లేదు. పాపమెత కన్నదేగాని యీ రోజులలో అక్కా చెల్లెండ్రను విచారించే వారెవరుకి ఇహ నాగురించి నీవు బెంగపెట్టుకోవద్దు. కాళ్ళూ చేతులూ సరిగా వున్నంతకాలం నాకొకరుచేయ నక్కర్లేదు. ఏదో చిలకాగోరింకల్లాగా మీ రిద్దరూ కలిసివుంటే నాకదే చాలు. ఇక్కడనయినా సరే. మరెక్కడనయినాసరే. అని మాత్రం అని వూరుకొంది. నేనుమాత్రం అత్తగారింట్లో వుండే ఆలోచన పూర్తిగా మానివేశాను. ఉద్యోగానికని విశ్వప్రయత్నాలు చేసి చివరకు మావూళ్ళోనే ఒకబ్యాంకిలో వంద రూపాయలకు గుమాస్తాగా కుదిరాను. ఉన్నవూళ్ళో ఉద్యోగం కనుక, అద్దె కొంపలబాధ లేదు కనుక అంతే కష్టమనిపించలేదు. ఇలా ఉద్యోగంలో ప్రవేశించిన సంగతి మా అక్కయ్యకూ అత్తయ్యకూ కూడా తెలియచేశాను. వారిద్దరు న్నట్లు ప్రాసినవాండ్లెవరూ గాదు. ఇలా ఆరెన్నెల్లయినాక ఒకరోజున మా అత్తవారి వూరినుంచొక బ్రాహ్మణుడు వచ్చాడు. నాభార్య పెద్దమనిషయినట్లు శాంతి చేసుకపోవలసినట్లూ కబురుపెట్టారు. మా అమ్మా నేనూ వెళ్లి ఆ తతంగం అంతా పూర్తిచేసుకొని సంధానానికి ముహూర్తం గూడా పెట్టుకొని వచ్చేశాం.

ఆ ముహూర్తానికి నేనూ మా అమ్మా మా అక్కయ్యమాత్రమే వెళ్లాం ఆడంబరాలవీ ఏవీ వద్దని ముక్తసరిగా ముహూర్తానికి. ఆ అవసరంకూడా తీర్చుకున్నాను.

ఆ రాత్రివరకూ నా కామె సంగతి దాని మనస్సులోని అభిప్రాయం నాకు తెలీదు. నేను వుద్యోగంలో ప్రవేశించానని, ఆ ఉద్యోగంలోనేవుండి జీవితం గడప నిశ్చయించుకున్నానని చెప్పాను. ఆమె నవ్వి వూరుకుంది. నీ అభిప్రాయం ఏమిటని అడిగాను.

'నా అభిప్రాయంతో మీ కేమి పని' అని అన్నది.





ఒక గంటలో యౌవ్వనము
కామస్తంభన
ధాతుపుష్టి. సంసారసుఖము విషయంలో సాటిలేనిది. విరాకతెందిన వృద్ధులయందు శక్తి, ఉత్సాహము నిచ్చును [illegible]
మదన మంజరి ఫార్మసీ
184, మైనా బజారురోడ్డు, మద్రాసు.
బెజవాడ-శ్రీనివాస మెడికల్ స్టోర్సు పార్కు రోడ్డు. రాజమండ్రి—ఈశ్వరదాస్ & కో. మెయిన్ రోడ్డు నెల్లూరు: అర్యన్ ఫార్మసీ.

'ఆ. అలాగాదు. మనం భార్యాభర్తలం గనుక మనం ఒకరి అభిప్రాయాలను ఒకరు తెలుసుకొని వాటి ప్రకారం నడుచుకో వలెనుగదా.'

'సరే, నా అభిప్రాయం ప్రకారం మీరు నడచుకోవలెనా?'

'యీ ప్రశ్న లెందుకు. నే నడిగిన దానికి సమాధానం చెప్పరాదూ.'

అయితే నాకేమీ అభిప్రాయం లేదు. మీ ఇష్టం వచ్చినట్లు చేయండి. మీ యిష్టమే నా యిష్టం.'

'అయితే నీవు నాతో వచ్చుటకు సిద్ధమే నా?'

'అంటే నేను రానని మీకేమన్నా అనుమానమా?

'అబ్బా. నన్ను విసిగించక నే నడిగిన దానికి సూటిగా చెప్పరాదూ?'

'అదేమిటండీ అడగరాని ప్రశ్న లడుగుతూ సూటిగా చెప్పమంటారు మీతో రాకపోతే నే నిక్కడేం చేస్తాను!'

'అదిగాదు కామూ నే ననేదీ, మీ అమ్మ నన్నిక్కడ వుండిపొమ్మంటున్నది. నే నిక్కడుంటే నువ్విక్కడే వుండవచ్చునని ఆమె అభిప్రాయం. నాతో వస్తే నీ కక్కడి సౌకర్యా లుండవు. కష్టపడవలసి వస్తుంది. అందుకని నన్నిక్కడే వుండి పొమ్మనమని నీవు గూడా అంటావేమోనని నా అనుమానం' అన్నాను.

'ఏమండీ మీరు! మీ రిక్కడుంటే మీకేం గౌరవం వుంటుంది. నా కిక్కడుంటే ఏం గౌరవం ఉంటుంది. మీరు మీ రున్న చోటనే వుండాలి. నేను మీ దగ్గరకే రావాలి నా దగ్గరకు రావలెనని మీరు పెండ్లిచేసుకోలేదుగదా. నయం- మా అమ్మమాటలు విని మీరిక్కడే వుండిపోలేదు. ఎప్పటికయినా మనం వేరుగా వుంటేనే మనిద్దరకూ గౌరవం. సుఖానికి కష్టానికి అంతేముందండీ! నాకు అన్నీ ఒకటే. మీతోపాటే నేనూనూ. మీరు రమ్మన్నపుడు రావటానికి సిద్ధమే' అన్నది.

ఆ మాటలు వింటుంటే నాకు పట్టరాని సంతోషం కల్గింది. నిరాశతో గూడిన మనస్సుకు శాంతి గల్గింది. ఇన్నాళ్లూ మాట్లాడని మనిషి ఎన్నో ఏండ్ల పరిచయం గల మనిషిమాదిరి ప్రస్తావించినందుకు ఆశ్చర్యం కల్గింది.

'అయితే కామూ, ఇన్నాళ్లూ యీ మాట లెక్కడికి పోయినవి. నే నేమన్నా మారానా యీ రోజున' అంటూ దగ్గర చేరాను. 'ఆ. మీకేమీ తెలీదండీ. సిగ్గంటూ లేకుండా ఆడది మగారితో మాట్లాడ కూడదు. దయిగా కొవరానికి రాన పుడు అసలే మాట్లాడకూడదు. మరీపాటి తెలుసుకోలేకుండా బి. ఏ. ఎట్లాప్యాస యారో' అంటూ దగ్గర చేరింది నా కాము.

మూడునిద్రలూ అయిపోయాక నా భార్యను నావెంట పంపమని అడిగాను మా అత్తయ్యను. 'అబ్బాయీ, ఇప్పుడేం తొందర. తర్వాత మంచిరోజు చూసి పంపిస్తాలే. నీవు వెళ్ళిరా అంది. సరేనని వచ్చేశాను. నాలుగు నెలలయినా మా అత్తయ్య నాభార్యను తీసుకరాలేదు. ఇంతలో నాకు రెండు వుత్తరాలు. ఒకటి మా అత్తయ్యదగ్గరనుంచి.

'చి॥ మధుసూదనరావుకు, నీవు వుద్యోగం మానివేసి మాఇంటికి వచ్చేయవలసింది. మా అమ్మాయి అక్కడికి వచ్చి కష్టపడలేదు. నీవు వచ్చేవరకూ మా అమ్మాయిని అక్కడికి పంపేది లేదు—'

రెండవది.

'ప్రియమైన శ్రీవారికి, నమస్కారములు. మీరు వచ్చి నన్ను తీసుకపోవలసింది. మా అమ్మ నన్ను పంపుప్రయత్నములో లేదు. నేనే వద్దామన్న అది బాగుండదు. నా కిక్కడ యింకో గడియ వుండ బుద్ధిపుట్టుటలేదు. మీద విషయములు నేరులో చెప్పెదను. వ్రాయలేను. మీ కాము.'

ఆ వుత్తరాలు చదివి యింటికివెళ్ళి ఏవో నాలుగు మెతుకులు నమిలి వాకిట్లో మంచంమీద పడుంవాల్చాను. మా అమ్మ కింకా సమాచారం చెప్పకముందే ఆమె వచ్చి నన్ను పైవిధంగా ప్రశ్నించే టప్పటికి నాకు మా అమ్మ ఆరోజే ఎలా నాతో యీమాట లన్నదా అనే ఆశ్చర్యం కలిగింది.

'అమ్మా, అత్తయ్యగారు అమ్మాయిని పంపరట. నేనే అక్కడికి పోవలెనట. యీరోజే వుత్తరం వచ్చింది.'

'ఆ, పంపక ఏంచేసుకుంటుందీ!'

'ఏమో. నేనుమాత్రం పోయి తీసుకరాను. ఆమే పంపిస్తుందో, అదే వస్తుందో చూస్తామని అనుకుంటున్నాను.'

'అదేమిటిరా, ఎవరి సొత్తుకోసం వాండ్లే వెళ్ళాలి. రేపు దసరాకి పోయి తీసుకరారా.'

'ఆ. నాకు భార్య అవసరమయితే, భార్యకు నే నవసరంకానా ఏం?'

'సరే. కాని ఆ పిల్ల స్వతంత్రించి ఎలా

(36-వ పేజీ చూడండి)

శ్రీ అంబాళ్
ఆఫీసర్స్ నస్యము




1 రూలము టిన్నులలో అన్ని చోట్ల దొరుకును.
శ్రీ అంబాళ్ అండు కంపెనీ,
[illegible]

# కాపురం

(23-వ పేజీ తరువాయి)

వస్తుందిరా. అత్తగారికి నీ వపుసరంలేదు ఆపిల్ల అక్కడుంటేనే ఆమెకు చాలు. కాబట్టి నీవే పోయిరారా నాయనా. ఇందులో పౌరుషంఎందుకు, ఏదో సంబంధం అయింతర్వాత పట్టింపులు పెట్టుకొని కీచులాడుకోటం దేనికి ?'

'సరేనమ్మా. నీవు చెప్పినట్లే రేపెళ్ళి దసరానాటికి నీ కోడలును మన ఇంటికే పిలుచుకవస్తాను. ఇంత బెట్టు చేసిన అత్తయ్యగారింట్లో నే నెందు కుంటాను దసరాకి' అని చెప్పి మర్నాడే అత్తారూరు బయలుదేరాను.

## 2

పిలుపులేకుండా అల్లుడు రావటం మా అత్తయ్యకు అలవాటయిపోయింది కాబట్టి నారాక కామె ఏమీ ఆశ్చర్యపడినట్లు లేదు. 'ఏం నాయనా క్షేమమేనా' అని మాత్రం అడిగింది. 'ఆ' అంటూంటే కాళ్ళు కడుక్కునేందుకు నీళ్లందించింది. ఫలహారాలూ అవీ కాంగానే మా అత్తయ్యతో నేను నా భార్యతోసహా మర్నాడే ప్రయాణం చేయవలసినసంగతి చెప్పాను. 'అదేమిటబ్బాయీ. ఇప్పుడు తీసుకెళ్లటానికెలా వీలుపడుతుంది పండుగ ముందర? పయిగా నేను వ్రాసినట్లుగా మీరిద్దరూ అక్కడికిపోయి కష్టపడటం దేనికి. ఇక్కడే వుండిపొండని ఎన్నిసార్లు చెప్పలే' అంది. 'ఆవిషయాలన్నీ నాకూ తెలుసు. కష్టమో సుఖమో నేను మా ఇంట్లోనే ఉండిపోనిశ్చయించుకున్నాను' అన్నాను.

'ఇది మాత్రం ఎవరియిల్లూ, ఇదీ మీ ఇల్లే ?' అంది మాఅత్తగారు.

'అదెట్లాగయినా రేపు మీ అమ్మాయిని తీసుకవెళ్ళవలసిందేనండీ '

'అది వల్లగాదు. అంతగా అవసరం అయితే నీవొక్కడవే పోవచ్చును.'

'మీ ఇష్టం యీ విషయంలో కుదరదు. ఇది నావిషయం. నా ఇష్టం' అని గట్టిగా చెప్పాను. 'ఓహో అదా సంగతి. సరే చూస్తాను. నీ యిష్టం ఎంతమాత్రం సాగుతుందో' అని చుర చుర చూస్తూ లోనికి వెళ్లింది.

'ఏమే కాముడూ మీ ఆయన చాలా గొప్ప కబుర్లు చెపుతున్నాడు విన్నావా' అని అనింది లోపల వంటప్రయత్నంలోవున్న నా భార్య దగ్గరకు వెళ్లి.

'ఏమిటమ్మా, అంతకోపంగా మాట్లాడుతున్నావు?' 'ఏముందీ, ఆయననిన్ను తీసుకెళ్లతాడుట వాండ్లవూరికి. నాయిష్టప్రకారం నడవటానికి ఆయనకు వీలులేదట. సరే నీ సంగతేమో కాస్త తేల్చి చెప్పు. నేనూ మీసుఖంకోసం చెపుతున్నాగాని మీరు కష్టపడటానికి గాదు. అక్కడికి వెళ్లిపోతే మీ ఇద్దరకూ గూడా సుఖంలేదు'

'అదేమిటమ్మా - ఆయనగారిష్టప్రకారమే పోదాం. నేనుమటుకూ కాదనటానికేముంది. కష్టమయినా సుఖమయినా వెళ్లక తప్పుతుందా? అయినా మాకక్కడ కష్టమేముంటుందమ్మా'

'ఆ! నీవు పసిదానివి. యీ రోజుల్లో వేలు తెచ్చుకునేవాళ్లే నానాయాతనలు పడుతున్నారు. మీ ఆయనకు వచ్చే వంద రూపాయలతో కాపురం ఎట్లా జరుగుతుందే పిచ్చిదానా, ఇక్కడ వుంటే లక్షణంగా తినవచ్చునుగాని అక్కడది సాధ్యమవుతుందా?'

'పోనీ అమ్మా, నీ కంత యిదయితేచాలనిది నీవు పంపగూడదూ. ఇదీ అదీ పెట్టుకొని ఆయనతోనే వుండి సుఖపడతాను.' అని అనేసింది నాభార్య. 'ఆఁ బాగుంది నీవరస. నీవీ గడపకదిలావంటే ఒక్క కానీ గూడా నేను నీకయి పంపేది లేదు. ఏదో ఇద్దరూ ఇక్కడుంటే సరిపోయింది గాని నీవూ ఆయనపక్షమే అయితే ఇక సాగేది కాదు. ఒక్కక్షణం మీ రిక్కడుండవద్దు వెళ్ళండి. మీకే తెలివి వస్తుంది' అంటూ ఎక్కడికో వెళ్లిపోయింది మా అత్తగారు.

మర్నాడే మేము బయలుదేరాము మా వూరికి. పాపం చీరలు గాని సొమ్ములు గానీ ఏమీ యివ్వలేదు వాండ్లమ్మ. కట్టుకున్న చీరతోనే వచ్చేసింది కాము నా వెంట. ఒక్కగానీ ఒక్క కూతురుమీద ఇంత నిర్దయగా ప్రవర్తించిందేమా ఆమె అనే ఆశ్చర్యంకలిగింది చూచినవారందరికీని. కని, పెంచి పెద్దచేసిన కూతురు తన మాట మీరి —నామాటమీద నడుచుకొన్నందుకే యీ పగంతాను. నాకూ అప్పుడు తెలిసింది. ఒకవేళ నేనే అక్కడ వుండిపోయి ఎప్పుడయినా ఆమె మాట వినకపోతే నా పని ఏమయివుండునా అని.

కోడలుతో నేను బండి దిగుతుంటే మా అమ్మ ఆశ్చర్యపోయింది ఎలా వచ్చారా అని. 'పోనీ పండుగ వెళ్ళింతర్వాతనే తీసుకరాలేకపోయినావురా నాయనా— పాపం వాండ్లమ్మ కెంత కష్టం వేసిందో' అని అన్నది.

'ఆ. పండగ ముందే ప్రయాణం చేసింది మీ వియ్యపురాలు' అంటూ లోపలికి వెళ్లాము మేము.

## 3

ఆరు నెలలయింది. ఎన్నడూ నా భార్య






కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో., రాజమండ్రి

వాండ్లమ్మ విషయం ప్రస్తావనకు తేలేదు. నేనూ ఆ విషయం రానీయలేదు. ఎంత గారాబంగా పెరిగినా మా యింట్లో అన్ని పనులూ చేస్తూ ఖులాసాగానే వున్నట్లు నడుచుకుంటున్నది. కాని మా అమ్మతో మాత్రం ఎన్నడూ మాట్లాడి ఎరుగదు. మా అమ్మగూడా పాపం తల్లితో విరోధపడి నాతో వచ్చేసినందుకని కోడలును ఎంతో ప్రేమతోనే చూస్తున్నది. అయినా నా భార్య మాత్రం మా అమ్మతో కలిసి మెలసి వుండలేదు దీనికి కారణం నేనూహించలేక పోయినాను. ఒకనాడు నేనే భార్యతో 'కామూ. మా అమ్మ ఎంతో ముచ్చటపడి కోడలు కావలెనని కోరుకొన్నది. ఒక్కనాడయినా నీవామెతో ఖులాసాగా వున్నట్లు కనబడలేదు. పోనీ ఆమె ఏమన్నా అంటున్నదా అంటే నిన్ను చాలా ప్రేమతో చూస్తున్నది. నీవామెతో ఎందు కంత కఠినంగా ప్రవర్తిస్తావు' అని అడిగాను.

'ఏమండీ. మీ రీ సంగతులలో జోక్యం కలుగజేసుకోకండీ' అనిమాత్రం అనేసింది.

'అదేమిటి కామూ. మనం ఒక చోట వుంటూ నీ వామెతో పలుకకుండా వుంటుంటే ఏం బాగుంటుందీ?'

'ఏం. ఎందుకు బాగుండదు. మీరు మా అమ్మతో మాట్లాడకపోతే నాకేం బాధ లేదే. మీకు మటుకు ఎందుకు బాధ' అని అన్నది.

'బాగుంది నీ వాదన. మగవాడికీ ఆడదానికీ భేదం లేదా? నేను మీ అమ్మతో మాట్లాడవలసిన అవుసరం లేదు. కాని నీవు మా అమ్మకు సేవ చేయవలసిన అవుసరం వుంది. కాని ఆమె నీసేవ కోరటంలేదు. నీతో సన్నిహితమే కోరుతున్నది.'

'ఓహో ఈ మాటలు చదువులేనివాండ్లు చెప్పవలసిన మాటలుగాని చదువుకొన్నవారు చెప్పవలసినవి కావు. మీ రేమన్నను యీ విషయంలో నా ఇష్టప్రకారమే వుంటాను. అయినా మీ అమ్మగారిని నేనేమీ అనటంలేదు. ఏదో నా మనసులో బాగుండక ఆమెతో చనువుగా మాట్లాడుట లేదు. మీ కోసరం మా అమ్మనుగాదని వచ్చేశాను. మీతో సరీగ్గానే వుంటున్నాను. అంతేగాని మీ అమ్మతో సరిగా లేనని మీ రనటంలో నా కేమీ అర్థం కనపడుటలేదు. అయినా మళ్ళీ చెపుతున్నానండీ. యీ విషయాల్లో మీరు శ్రద్ధ తీసుకోకండీ' అంటూ నా దగ్గర చేరి నా కళ్లలోకి అదోలా చూసింది. నాకూ జాలివేసింది.

'ఇక నెప్పుడూ నిన్నీ విషయంలో కష్టపెట్టను కామూ' అంటూ దగ్గరకు తీసుకొన్నాను.

అప్పటినుంచీ మా ఇద్దరమధ్యా ఎట్టి వాదనా జరుగలేదు. కాపురం హాయిగా గడిచిపోతూంది. మా అత్తగారన్నట్లు మేము కష్టపడుటకు మారుగా సుఖంగా కాలం వెళ్లబుస్తున్నాము. మా అమ్మగూడా పరిస్థితిని అర్థంచేసుకొని కోడలు పలుకలేదే అన్న చింతను మానివేసి ఖులాసాగానే కాలం వెళ్లబుచ్చుతున్నది. ఇలా వుంటుండగా మా యింటికి మా అక్కయ్య వచ్చింది. ఆమె రావటం నాకెంతో హాయి అనిపించింది కాని కామ మాత్రం ఆ రోజునుంచీ అదో రకంగా వుంటం మొదలు పెట్టింది. ఏదో నిరుత్సాహంగా మాట్లాడేది. పైగా మా అక్కయ్యతో గూడా మాట్లాడటంలేదు. అందుకు మా అక్కయ్య నొచ్చుకున్నది. నాతో 'ఏరా తమ్ముడూ. నీ భార్యకు నే నిక్కడకు రావటం ఇష్టంలేనట్లున్నది. అయినా యిది వాండ్ల యిల్లుగాదుగదా. నీ యింటికని వచ్చినా ఆమెగారికి కష్ట మెందుకో' అంటూ మాట్లాడింది. నాకూ కష్టం వేసింది. అటు భార్య-ఇటు అక్కయ్య. నాకు మా అక్కయ్యమీద ఎంత ప్రేమో, నా భార్య కేం తెలుసు? అందుకని రాత్రి మళ్ళీ నాకూ నా భార్యకూ వాదన జరిగింది. ఇంటికి వచ్చిన బంధువులతో అందులో మా అక్కయ్యతో మాట్లాడకపోతే చాలా తప్పన్నాను కాని నా భార్య ఆమాటను వప్పుకోలేదు సరిగదా యింకోమాట గూడా అన్నది. ఏమండీ—నేను మా అమ్మతో తగవులాడి వచ్చినప్పటినుండీ నాకు ఆమెను చూడవలెననే లేదు. కాని మీ అక్కయ్య యిక్కడకు వచ్చినప్పటినుండీ అదేందుకోగాని నాకూ మా అమ్మను చూడవలెనని వున్నదండీ. కాబట్టి రేపే మనం మా వూరికి వెళ్లివద్దామన్నది. నా కాశ్చర్యం-కోపం వేశింది. 'మీఅమ్మ ఇటు రావన్నా లేదు. పైగా వుత్తరం ముక్కన్నా వ్రాయలేదు. మనం అక్కడికి పోవచ్చునేం?' అన్నాను. కాని కామ వప్పుకోలేదు. 'అదేమిటండీ. ఆమెతో పోట్లాడినందుకు ఆమెకు కోపం వచ్చి వుంటుంది. అంతేగాని మనం పోతే ఏమండీ! తప్పేముందా మనం రేపు మావూరు వెళ్లాలిసిందే' అంది. నాకు మరీ కోపం వచ్చింది. వెళ్ళటానికి వీల్లేదని గట్టిగా అనేశాను. 'పోనీ మీరు రాకపోతే నేను వొక్కర్తెనూ వెళ్ళివస్తాలెండి' అన్నది. అట్లా వెళ్ళటానికి నేను వప్పుకోనన్నాను. 'మీరు వప్పుకున్నా వప్పుకోకపోయినా రేపు నేను మా అమ్మగారింటికి వెళ్లటం ఖాయం' అని వూరుకున్నది.

అనుకున్నట్లుగానే తనపెట్టె బేడా సర్దుకొనివాండ్ల పుట్టింటికి బయలుదేరింది. ఇంతలో మా అమ్మ, మా అక్కయ్యగూడా వద్దన్నారు కాని వినిపించుకోకుండా నే వెళ్లొస్తానండీ' అనిమాత్రం నాతో అని బండెక్కింది నాకు పట్టరానికోపం వచ్చేసింది. కాని ఏం చేయనూ తోచక పైన గుడ్డవేసుకొని వీధిలోకి నడిచాను.

## 4

ఇంటికి రాంగానే మా అక్కయ్య నన్ను ప్రశ్నించింది. 'ఏరా తమ్ముడూ, నీవేమైనా అన్నావా నీ భార్యను-పాపం


ప్రపంచ ప్రఖ్యాత మద్రాసు నశ్యం

నాణ్యతయే దానిఘనత



ఒకసారి కొంటే తిరిగి వదలిపెట్టరు

నశ్యములలో ఉత్తమమైనది పట్నం నశ్యమే. కాని అత్యుత్తమమైనది, అందరూ కోరునది, కారం, నాణ్యత, సువాసన గలది. అప్పాదురై నశ్యమే

అ. అప్పాదురై ముదలియార్ & సన్జ్

ఆచారప్పన్ వీధి, పోస్టుబాక్సు నెం. 189, మద్రాసు-1.

తల్లి నిగూడా కాదనిపిస్తే ఎందుకురా దానిని వేధించటం?'

'ఊరుకో అక్కయ్యా, నీకేమీ తెలియదు. పోతేపోనీ, అదే వస్తుంది తిరిగి' అని మాత్రం అన్నాను. మర్నాడే వద్దు వద్దంటుంటే వినిపించుకోకుండా మా అక్కయ్య కూడా వెళ్ళింది. ఇహ యింట్లో మిగిలింది నేనూ మా అమ్మనూ. అలాగా రోజులు వెళ్లిపోతున్నవి. నెలలు గడచినవి. సంవత్సరం అయింది. కాని నాకూ నా భార్యకూ మధ్య వుత్తరాలు కూడా లేవు. ఆమె తిరిగి రానూ లేదు. ఒకరోజున మా అమ్మే నన్ను మళ్లీ ప్రశ్నించింది. 'ఏంరా అబ్బాయ్. ఎందుకూ యింత పట్టుదల. తెలిసో తెలియకో ఆ అమ్మాయి వాళ్ల అమ్మను చూద్దామని వెళ్లింది. నీవు పోయి తెచ్చుకో కూడదా. ఎవరిమీద కోపం? చదువుకున్న వాడికి కాస్త ఓర్పు ఉండద్దా. పోయి నీ పెళ్లాన్ని నీవు తెచ్చుకోనాయనా' అని అన్నది. నాకు మా అమ్మమీద కోపం వచ్చింది. 'తెలుసు. నీవేమీ చెప్పనక్కర్లే' దని అనేసి వూరుకున్నాను.

తర్వాత మా అక్కయ్యదగ్గరనుంచి ఒక వుత్తరం వచ్చింది. నన్ను చూసి పొమ్మనమని వ్రాసింది. వెళ్ళంగానే 'ఏరా తమ్ముడూ, మరదలు వచ్చిందా' అని అడిగింది. 'అదెందుకు వస్తుందీ, రాలే' దన్నాను. 'అయితే నీవె పోయి తీసుకొచ్చుకోకూడదా?' అన్నది.

'నేను పంపితేగదా నేను తీసుకవచ్చుకునేది. అదే పోయింది. అదే వస్తుంది. నేను పోవాలిసిన అవసరం ఏముందీ?'

'బాగుందిరా, నీవు తెలిసినవాడివి. అది తెలియనిదీని. నీవూ దానితో సమానం అయితే ఎట్లాగురా!'

'అక్కయ్యా, నేనుమాత్రం యిక వాళ్లింటికి పోను. వచ్చినపుడే వస్తుంది' అని అన్నాను. అందరూ నన్నే తప్పు పట్టటం నాకేమీ సరిగా లేదు. అయినా నాకు తోచినట్లే నేను నడవదలచాను. రెండుమూడు రోజు లున్నతర్వాత మా వూరికి వచ్చేశాను.

## 5

ఇంకో నెలరోజులు గడచినవి. ఆరోజు ఆదివారం. ఆఫీసుకు శెలవుగదా అని ఏడుగంటల దాకా పడుకొన్నాను. 'ఏమండీ. ఇంకా తెల్లవారలేదా ఏమిటి జాముప్రొద్దెక్కింది. కాఫీ చల్లారిపోతున్నది. లేచి ముఖం కడుక్కోండి' అంటూ కాము నాగదిలో ప్రత్యక్షమయింది. కలో నిజమో అనుకొంటూ కళ్లు నులుముకుంటూ యింట్లోకి వెళ్లితే మా అత్తయ్య 'ఏం నాయనా, కులాసాగా వున్నావా' అంటూ ప్రశ్నించింది. ప్రక్కనే మా అక్కయ్య 'ఏంరా తమ్ముడూ. యింకా నిద్రమత్తు వదలినట్లు లేదే. ఇంటికి చుట్టాలు వచ్చినా నిద్రేనా' అంటూ పల్కరించింది. నాకు అందరినీ చూస్తుంటే పట్టరాని సంతోషం వేసింది. 'అమ్మా, ఎప్పుడు వచ్చారే మన వాళ్లంతానూ?' అని అడిగాను.

'రాత్రి 2 గంటలబండిలో వచ్చారురా. ఆరాత్రిలో నిన్ను లేపలేదు' అని అన్నది. ఆరోజు మాయింట్లో పండగజేసుకున్నాం. నాకూ చాలా సరదావేసింది. మా అక్కయ్యా, కామూ, మా అమ్మ మా అత్తయ్యా అంతా ఎంతో కలిసి మెలిసి పనులు చేసుకుంటున్నారు నాకిదంతా చూస్తే ఎంతో హాయి అనిపించింది భోజనాలవేళ కాప్పెసింది మా కాము జరిగిన సంగతంతా నా బదులు మా అక్కయ్యే మా అత్తారూరు వెళ్లిందట. వెళ్లి నేనెంతో అవస్థపడుతున్నానని చెప్పిందిట - నాకెవ్వరిమీదా కోపం లేదనీ, మా అత్తయ్యకు చెప్పిందట. ఇప్పు డెట్లా తిరిగినా చివరకు మా తమ్ముడు అత్తగారింట్లోనే ఉండి ఆస్తిపాస్తులు చూసుకోడా? ఏదో చిన్నతనం. సరదాకోసం ఉద్యోగం చేస్తున్నాడు. నీకూతురు మటుకు వేరే యింట్లో కాపురం చేయవద్దా. వాళ్లిద్దరూ ఎక్కడున్నా మీ వారే గదా?' అని చెప్పిందిట. దీంతో మా అత్తయ్యకు నామీద ప్రేమా విశ్వాసమూ కలిగి 'అమ్మాయీ యీరోజే మనమంతా మీవూరుకు పోదాం' అని అనేసిందిట. 'మంచిది' అంటూ మా కాము తన చీరెలూ, సొమ్ములూ యివీ అవీ అన్నీ పోగేసుకొని బయలుదేరిందిట. అది చూసి మా అత్తయ్య 'మా కారా. మహాలక్షమ్మగారూ, తన యింటికని మా యిల్లంతా ఖాళీచేసేస్తున్నది. మా కాము చాలా గడుసుదమ్మా' అని నవ్విందిట. అంతా సర్దుకొని ప్రయాణమయి మా వూరు వచ్చేశారుట అదీ జరిగినసంగతి.

ఆ రాత్రి కాము నాతో అన్నది: 'ఏమండీ, మన కాపురం సుఖమయం గావటానికి ఆవిడే కారణం. నాకు స్వర్గంలో వున్నట్లనిపించింది. కాపురంలో కలతలు లేకుంటే ఎంత సుఖమో తెలిసి వచ్చింది. నవ్వుముఖంతో కళకళలాడే నా కామును దగ్గరకు తీసుకున్నాను.

ఇదే కాపురం! ★


నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నిర్బలత, నిస్సత్తువ శుక్ల నష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 12 అ.
పి. సి. ఏ. &కంపెని. "ఆయుర్వేదసమాజం"
పెర్నిదేపి- నెల్లూరు జిల్లా.



నమ్మకమైన నంజనగూడు కుటుంబ ఔషధములను వాడుడు
నంజనగూడు పండ్లపొడి
తీపి, ఉప్పు ప్యాకెట్లు
సకల పండ్లవ్యాధులను ఆపి, మాన్పు
ఐ.డి యల్ 61 నంజనగూడు పండ్లపొడి (డబ్బ)

శ్రీకర కస్తూరి మాత్రలు — పిల్లలకు పెద్దలకు శ్రేష్ఠమైన సంజీవి
కర్జన — (గోరోజన మాత్రలు) పశిపాపలకు
బాలక్స్ — విరేచన మాత్రలు పెద్దలకు పిల్లలకు
జ్వరేగ్ — సకల జ్వరములకు
కాలరెక్స్ — అతిసారము కాలరాకు
జినజిప్ — జీర్ణవృద్ధికి పిత్తశాంతికి

స్త్రీలకును, ఇతరులకును విశేష మందుల జాబితాలకు వ్రాయండి.

విజయవాడ బ్రాంచి : రైల్వే శరీవీధి, సత్యనారాయణపురము.
మా అపూర్వమైన ఔషధముల జాబితాలకు వ్రాయండి.